

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : **బి.వి.ఎల్.ఎన్.రాజు**



సంపుటి : 14 | సంచిక : 06 | ఫిబ్రవరి 2009

**రమణ భాస్కర**
ఆధ్యాత్మిక మాస పత్రిక

**పేజీలు : 28**

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(ఫైమ)

**చందా**
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
**రమణ భాస్కర**
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


**ఈ సంచికలో....**


పెన్నాడ ................ 11-11-08
ఏలూరు ............... 01-01-09
జిన్నూరు ............. 04-12-08
అరుణాచలం........ 11-12-08



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-11-08, పెన్నాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అమెరికా ప్రెసిడెంట్‌గా చేసిన రూజ్‌వెల్ట్ ఒక సందర్భంలో నేను గురించి మాట్లాడాడు. ఆయన పొలిటీషియన్ అయినా నేను గురించి అద్భుతంగా మాట్లాడాడు. రూజ్‌వెల్ట్ చెప్పింది ఏమిటి అంటే దేహము నేను అనే భావన అందరికీ ఉంది. ఈ నేను అనేది ఒక తలంపు. నేను అనే తలంపు ఉన్నంతకాలం పునర్జన్మలలో నుండి బయటకు రాలేము. మీరు ఏ దేశీయులైనా, మీరు ఏ కులంలో ఉన్నా, ఏ మతంలో ఉన్నా, ఏ సాధనలు చేస్తున్నా ఈ నేను అనే తలంపు మీకు ఉన్నప్పుడు ఏవో దుర్గుణాలు ఉంటాయి, స్వార్ధం ఉంటుంది, పరిమితులు ఉంటాయి, బలహీనతలు ఉంటాయి. దేహము నేను అనే తలంపు ఉన్నంతకాలం వాడు కానిదానితోటి తాదాత్మ్యం పొందటం మానడు. ఒకవేళ వాడు అనుకొన్నా వాస్తవజీవితంలోనికి రాలేడు అని చెప్పాడు. మనం ఎటువంటి భక్తులం అని రూజ్‌వెల్ట్ చెప్పాడు అంటే ఇల్లు విడిచిపెట్ట కూడదు, రోడ్డుమీదకు వెళ్ళాలి. ఈ నేను అనే తలంపును అతిక్రమించాలి అని మనకు లేదు కాని బ్రహ్మజ్ఞానం వచ్చేయాలి అనుకొంటున్నాము, ఇది సాధ్యం కాదు అని చెప్పాడు. ఈ నేను అనే తలంపు ఉన్నంతకాలం హద్దులు, పరిమితులు ఉంటాయి, అది ఉన్నంతకాలం దుఃఖం నిన్ను విడిచిపెట్టదు. నువ్వు ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎన్ని సాధనలు చేసినా

ఈ నేను అనే తలంపులోనుండి బయటకు రాలేనప్పడు ఏమీ ప్రయోజనం లేదు. ఎన్ని మందులు వాడినా రోగం తగ్గనప్పడు ప్రయోజనం ఏమిటి అలాగే నీవు ఎన్ని సాధనలు చేసినా ఈ నేను అనే తలంపులో నుండి బయటకు రాలేకపోతే యూనివర్సల్ అవ్వలేవు. మీలో ఉన్న ఆ నేనే నేరస్థుడు. మనం ఏది చేసినా దానికోసమే చేస్తాము. నేను అది చేసాను, నేను ఇది చేసాను అనుకొంటూ ఈ నేను పుణ్యాన్ని పోగుచేసుకొంటుంది, పాపాన్ని పోగుచేసుకొంటుంది. నువ్వు పుణ్యఫలితం కావాలి అనుకొంటావు, పాపఫలితం అక్కరలేదు అనుకొంటావు. నీకు బ్రహ్మజ్ఞానం కావాలంటే నువ్వు పాపాన్ని ఎలా విడిచిపెడతావో పుణ్యాన్ని కూడా అలాగ విడిచిపెట్టు. సర్వసాధారణంగా పుణ్యం చేసే వారు పుణ్యఫలితం ఆశిస్తారు దానివలన పుణ్యఫలితం వస్తుంది కాని జ్ఞానం రాదు. ఈ నేను అక్కడకు పరిమితమైపోతుంది.

మీరు ఈశ్వరుడిని హృదయపూర్వకంగా నమ్మితే మీకు శరణాగతి వచ్చేస్తుంది, అశాంతి పోతుంది. కాని మన మనస్సు ఏమి చేస్తుంది అంటే అది ఈశ్వరుడిని నమ్మినట్లు నటిస్తుంది కాని నమ్మదు. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహగతమైననేనులో నుండి బయటకు రాకుండా ఈశ్వరుడి వైపు మీ కళ్ళు తెరువబడవు. బ్రహ్మంను తెలుసుకో అని పరమాత్మ చెప్పాడు. బ్రహ్మం గొప్పది అని మనం అనుకోవటం లేదు. కొంతమంది ధనం గొప్పది అనుకొంటున్నారు, కొంతమంది చదువు గొప్పది అనుకొంటున్నారు, కొంతమంది గౌరవం గొప్పది అనుకొంటున్నారు కాని మీరు అనుకొనేవి ఏమీ గొప్పవికాదు, బ్రహ్మమే గొప్పది. ఆ జైలులో నుండి బయటకు రాకుండా బ్రహ్మం గొప్పది అనే విషయం నీకు తెలియదు. మన అహంభావన కల్పించే విషయాలను ప్రేమిస్తున్నంతకాలం నిజమైనవస్తువును ప్రేమించలేము. అందరి హృదయాలలో నేను అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ గీతలో చెప్పాడు. మన అందరకు తలకాయ గొడవ తప్పించి ఎవరికి హృదయం గొడవ లేదు. మన మనస్సు ఈ తలకాయలో మకాం పెట్టింది. నువ్వు శిరస్సులో బతుకుతున్నంతకాలం నీకు జ్ఞానం ఏమిటి? హృదయంలో బతకటం నేర్చుకో. హృదయంలో బతికేవాడికి కదా స్వర్గరాజ్యం అంటాడు. నీవు హృదయంలో బతుకుతూ ఉంటే లోకంలో 90 గొడవలు జరుగుతున్నా అవి ఏమీ నిన్ను ముట్టుకోవు, వాటి స్పర్శ నీకు తగలదు. హృదయంలో బతుకుతున్నప్పడు గుణాల ప్రభావం తగ్గిపోతూఉంటుంది. హృదయంలో వాడు అనుభవిస్తున్న

శాంతి వలన, సుఖం వలన గుణాలు వచ్చి వాడిని ముట్టుకొన్నా వాటిమీద ఆకర్షణ కలుగదు, అవి అలా వచ్చి వెళ్ళిపోతూ ఉంటాయి, వాడు గుణాతీతుడు అవుతాడు.

వివేకం, నైపుణ్యం, సామర్థ్యం ఇవి మూడూ చాలా ముఖ్యం అని వ్యాసుడు చెప్పాడు. ఒక పని చెయ్యాలా, చెయ్యకూడదా అని బాగా ఆలోచించి చేసేదే వివేకం. ఆ పని చేయటానికి నిర్ణయించుకొన్నాక ఆ పని ఎలా చేయాలో నేర్చుకోవాలి, అది నైపుణ్యం, ఆ నైపుణ్యం నేర్చుకొన్నా సరిపోదు ఆ పని ముగింపు చేయాలి, ఆ ముగించగల శక్తి నీకు ఉన్నప్పుడు అది సామర్థ్యం. ఇవి మూడు చాలా ముఖ్యం. పక్షి ఎగరటానికి రెండు రెక్కలు ఎలా అవసరమో అలాగే నువ్వు లోపలకు వెళ్ళటానికి వివేకం, వైరాగ్యం రెండూ అవసరం. మనకు ఎంతోకొంత వివేకం ఉంది కాని వైరాగ్యం అసలు లేదు. ఈశ్వరుడు ఉన్నాడు అని మనం అనుకొంటున్నాము కాని ఆయన మీద ఉండవలసినంత విశ్వాసం మనకు లేదు. ఆయన మీద మనకు పూర్తి విశ్వాసం ఉంటే మీ సాధనలతో సంబంధం లేకుండా మనస్సు దానంతట అదే ఆగిపోతుంది. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రాకుండా నీ మనస్సే నీకు అడ్డువస్తోంది. పూర్వజన్మలో చెడ్డకర్మ చేసాము ఇప్పుడు బాధలు అనుభవిస్తున్నాము, పూర్వజన్మలో మంచికర్మలు చేసాము ఇప్పుడు సుఖపడుతున్నాము అని అంటారు. వారు అలా ఏడుస్తున్నారు, వీరు ఇలా ఏడుస్తున్నారు, ఇవన్నీ పిచ్చిమాటలు. మీరు మనస్సులో బతుకుతున్నారు. ఆ మనస్సులో నుండి బయటకు రాలేక ఇలా ఏడుస్తున్నారు. ఈ పుణ్య పాపాలు అన్నీ ఎక్కడ ఉన్నాయి. నీ మనస్సులో ఉన్నాయి. రా అక్కడ నుండి బయటకు రా. నీ మనస్సులో నుండి బయటకు వస్తే ఏమీ లేదు. ఏదో పుణ్యం వస్తుందని, గౌరవం వస్తుందని, మీ పేరు గోడమీద రాస్తారని చెపితేగాని పనులు చెయ్యరు. నీ పేరు మీద నీకు అంత ప్రేమ ఉన్నప్పుడు, అందులో నుండి బయటకు రాలేనప్పుడు ఈశ్వరుడి మీద నీకు ప్రేమ ఎలా కలుగుతుంది. పేరు నువ్వా, నువ్వు కాదు. శరీరం నువ్వా, నువ్వు కాదు. నువ్వు కానిదాని మీద నీకు అంత ప్రేమ ఉన్నప్పుడు, నువ్వు ఏదిగా ఉన్నావో దానిమీద నీకు ప్రేమ ఎలా కలుగుతుంది, కలుగనే కలుగదు, అసలు మనస్సు అటువెళ్ళదు. రూజ్‌వెల్ట్‌కు మనకు తేడా ఏమిటి అంటే వాడు పైకి పొలిటీషియన్ కింద కనిపిస్తున్నా లోపల భక్తి ఉంది. మనం పైకి భక్తుల కింద కనిపిస్తున్నాము గాని లోపల భక్తి లేదు.

మేము లైఫ్‌ను బాగా ఎంజాయ్ చేస్తున్నాము అంటే అలా ఎంజాయ్ చేయటం వలన ఎంజాయ్ చేయాలనే తలంపు పెరిగిపోతూ ఉంటుంది. ఎంజాయ్‌మెంట్‌కు నీకు ఉన్న డబ్బు అంతా ఖర్చుపెడుతున్నావు అనుకో, నువ్వు ఖర్చుపెట్టిన డబ్బు అంతా ఇసుకలో పోసిన నూనెలా ఉంటుంది, ఇసుకలో పోసిన నూనెను బయటకు తీసుకోలేము. ఇతరులకు నువ్వు ఏదైనా అవసరాన్ని బట్టి సహాయం చేస్తే, నువ్వు చేసినది మొత్తం అంతా తిరిగి నీకే వచ్చేస్తుంది. నువ్వు ఇతరులకు ఇచ్చేదంతా తిరిగి నీకే వచ్చేస్తుంది అని తెలిస్తే నువ్వు ఇయ్యకుండా ఎలా ఉండగలవు అన్నారు భగవాన్. మీకు వంద పైసలు స్వార్ధం ఉంటే అందులో పది పైసలు తగ్గించుకొన్నా నువ్వు సమాజానికి ఎంతో ఉపయోగపడవచ్చు. నేను ముక్తికోసం తొందరపడటంలేదు, నాకు ముక్తి వచ్చినా రాకపోయినా ముందు ఈశ్వరుని పాదాలయందు భక్తిని అనుగ్రహించండి, అది స్థిరంగా ఉండేటట్లు అనుగ్రహించండి అని భగవాన్‌ను అడిగితే భగవాన్ ఏమన్నారు అంటే ఆ తపన నీకు ఉంటే భక్తి స్థిరపడుతుంది, మీకు నిజంగా భక్తి కుదిరింది అనుకోండి మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతుంది, అప్పుడు నీవు మోక్షాన్ని కోరుకోనక్కరలేదు, నీకు యోగ్యత వచ్చినప్పుడు భగవంతుడే మోక్షాన్ని నీకు ప్రసాదిస్తాడు. వివేకానందుడు చదువుకొనే రోజులలో ఎప్పుడైనా రామకృష్ణుడి దగ్గర కూర్చుని నేను ఆ మహాత్ముడిని చూసి వచ్చాను, ఈ మహాత్ముడిని చూసి వచ్చాను అనేవాడు. నువ్వు ఎవరినైతే మహాత్ములు అంటున్నావో వారి అందరికంటే నువ్వే పెద్ద మహాత్ముడివి అది నీకు తెలియటం లేదు అనేవారు రామకృష్ణుడు. కలకత్తాలో అందరూ ఈయనను పిచ్చివాడు అనుకొంటున్నారు, నిజంగా ఈయన పిచ్చివాడే, చదువుకొనే పిల్లవాడిని నన్ను మహాత్ముడు అంటాడు ఏమిటి అని వివేకానందుడు మనస్సులోనే అనుకొనేవాడు. రామకృష్ణ పరమహంస ఏమనేవారు అంటే నువ్వు నన్ను ఎలా అనుకొన్నాఫరవాలేదు, నీ ఇష్టం వచ్చినట్లు అనుకో, వారు ఏదో మంచి పనులు చేసి మహాత్ములు అయ్యారు, నువ్వు పుట్టుకతోనే మహాత్ముడివి అనేవారు అంటే చాలాదూరం చూసేవారు రామకృష్ణుడు.

కొంతమంది జ్ఞానం కోసం అసలు ప్రయత్నం చేయనక్కరలేదు, జ్ఞానమే వచ్చి వారిని వరిస్తుంది. అంటే పూర్వజన్మలోనే వారు పండిపోయి వస్తారు అంటే చేయవలసిన సాధన అంతా పూర్వజన్మలోనే అయిపోతుంది. కర్పూరం హారతిలో పూర్తిగా ఎలా కరిగిపోతుందో

అలాగ ఈశ్వరప్రేమలో, దైవభక్తిలో నీ మనస్సు పూర్తిగా కరిగిపోయేవరకు నువ్వు భక్తిని విడిచిపెట్టకు. ఎప్పుడైతే ఈశ్వర భక్తిలో నీ మనస్సు పూర్తిగా కరిగిపోయిందో అప్పుడు హృదయగతమైన జీవితం ప్రారంభమవుతుంది, అక్కడ వ్యక్తిగతమైన నేను ఉండదు. నేను కర్మ అనుభవిస్తున్నాను, నేను కర్మ అనుభవిస్తున్నాను అనుకొంటున్నారు, కర్మ అనుభవిస్తున్నాను అని ఏ నేను అయితే చెపుతోందో అందులోనుండి బయటకు రావటానికి నీవు చేసే ప్రయత్నం ఏమిటి? కొంతమంది ప్రయత్నం చేస్తారుగాని సిన్సియారిటీ ఉండదు. మనకు అసలు ఆ ప్రయత్నమే లేదు ఎంతసేపు ఆ నేను చుట్టూ తిరుగుతూ ఉంటాము. ఈ నేను పోతే మనం పోతాము అని చాలామందికి భయం అందుచేత ఆ నేనును పోగొట్టుకోవటానికి ఇష్టపడరు. ఆ నేను పోతే నీవు పోవు, నువ్వు ఎవరో నీకు తెలియబడుతుంది. మనస్స హృదయాభిముఖంగా ప్రయాణం చేయటానికి ఏకాగ్రత, పవిత్రత చాలా ముఖ్యం. కాయ ముగ్గి పండు అవ్వటానికి కొంతకాలం చెట్టుని అంటిపెట్టుకొని ఉంటుంది, పండు అయిన వెంటనే ఒక్క క్షణంలో కింద పడిపోతుంది. అలాగే నీ మనస్సు పవిత్రం అవ్వటానికి కొంతటైము పడుతుంది కాని మనస్సు పవిత్రం అయ్యాక హృదయగుహలో పడటానికి కొన్ని క్షణాలలో పడిపోతుంది, అది మీకు తెలియదు, మీకు అందరికీ ఆ ముహూర్తం వస్తుంది కాని అది ఎప్పుడు వస్తుందో తెలియదు.

మనస్సులో చెడు అలవాట్లు ఉన్నాయి అనుకోండి వాటిని విడిచిపెట్టమంటే అది విడిచిపెట్టదు, దూడ వట్టిగడ్డి తింటోంది అనుకోండి దానిని వట్టిగడ్డి తినటం మానెయ్యి అంటే మానదు నెమ్మదిగా పచ్చగడ్డి తినటం అలవాటు చేస్తే వట్టిగడ్డి తినటం దానంతట అదే మానేస్తుంది. అలాగే మనస్సును చెడుఅలవాట్లు మానమంటే మానదు దూడకు పచ్చగడ్డి అలవాటు చేసినట్లే మనస్సుకు మంచిగుణాలు, మంచిఅలవాట్లు నేర్పండి, అప్పుడు అదే చెడుఅలవాట్లను వదిలేస్తుంది. మంచితనం కూడా గమ్యంకాదుగాని మంచితనం భగవంతుడి పాదాల దగ్గరకు దారి చూపిస్తుంది. లోకానికి సంబంధించిన విషయాలలో అనురక్తి తగ్గించుకో అలాగని సోమరితనంగా ఉండకూడదు. నీ దేహానికి భగవంతుడు ఏ పని అయితే కేటాయించాడో ఆ పనిని నీ పని అనుకోవద్దు, అది భగవంతుడి పని అనుకొని శ్రద్ధగా చెయ్యి. మీ ఇంట్లో ఎవరైనా ముసలివారు ఉన్నారు అనుకో, వారు నీ వాళ్ళు అనుకోవద్దు,

వారు భగవంతుడి వారే అనుకొని ప్రేమగా సేవ చెయ్యి. మనం అనుకొన్నా అనుకోకపోయినా వారు నిజంగా భగవంతుడి వారే. ఎందుచేతనంటే ఆ శరీరం చనిపోతే వారికి మనకు సంబంధం లేదు కాని ఆయనలో ఐక్యమయ్యేవరకు భగవంతుడు వారిని విడిచిపెట్టడు. వైరాగ్యం చాలా రకాలుగా వస్తుంది. మీ ఇంట్లో ఎవరైనా చనిపోయారు అనుకోండి, ఏవైనా కష్టాలు వచ్చాయి అనుకోండి, మీ ఆస్తి సడన్‌గా పోయింది అనుకోండి ఆ రకంగా కూడా వైరాగ్యం రావచ్చు, ఇవి ఏమీ పెర్మనెంట్‌గా ఉండవు. వివేకం వలన వచ్చే వైరాగ్యం మాత్రమే పెర్మనెంట్‌గా ఉంటుంది. ఆ వైరాగ్యం వివేకంలో నుండి పొంగిరావాలి.

ఈమధ్య ఒక సాధువుగారు నాతో ఏమనిచెప్పారు అంటే ఎవరో భక్తులు తీసుకొని వచ్చి ఆయనకు నాలుగు కాసులు బంగారం ఇచ్చారట. అంతకు ముందు బంగారం మొఖం నాకు తెలియదు, అంతకు ముందు రామనామం చేసుకొనేవాడిని. నాలుగు కాసులు వచ్చాక రామనామం వదిలేసాను. కాసు రేటు ఎంత ఉంది, ఎవరిచేత అమ్మించాలి, వచ్చిన డబ్బు ఎలా ఖర్చుపెట్టాలి అని రాముడిని వదిలేసి నా మనస్సు బంగారాన్ని పట్టుకొంది అని చెప్పాడు. ఈ నాలుగు కాసులు పేరు చెప్పి నా భక్తి చెడిపోయింది అని ఇంకో మహాత్ముడి దగ్గరకు వెళ్ళినప్పుడు చెప్పాను ఆయన ఏమన్నారు అంటే ఈ బంగారాన్ని పట్టుకెళ్ళి అమ్మవద్దు, దానిని పేడలో కలిపెయ్యి అని చెప్పారు. అలా పేడలో కలిపేసాక నా మనస్సు కుదురుపడింది అని చెప్పాడు. బంగారం ఇచ్చారు, ఇది అమ్మేస్తే డబ్బు వస్తుంది, దానితో మంచిపనులు చేయవచ్చు అంటే మాయ ఎలా గెంటుకొనిపోతోందో చూడండి. నాకు రామభక్తి పోయింది అన్నాడు పాపం. అంటే దాని వేగం మీకు అర్థమవుతోందా? అంతకు ముందు సుఖంగా ఉన్నాడు. ఒకవేళ బంగారం అమ్మేసి ఏదైనా మంచిపని చేసినా నీ బుద్ధి పాడైపోతుంది అని ఆ మహాత్ముడు చెప్పాడట. ఏదైనా మంచి పని చేసినా అది నేను చేసాను అంటావు, ఎవడికైనా ఇచ్చినా నేను దానం చేసాను అంటావు మొత్తంమీద పాడైపోతావు అందుచేత పేడలో కలపటమే నువ్వు చేయవలసిన పని అని చెప్పాడట.

శరీరం ఎక్కడ ఉంది అనేది ముఖ్యం కాదు. నీ మనస్సులో భగవంతుడితోటి అనుబంధం పెట్టుకోవాలి. నీ మనస్సులో ఈశ్వరుడితో పెట్టుకొన్న అనుబంధం సహజమవ్వాలి. నేను ఈశ్వరుడిని నమ్ముతున్నాను అని నువ్వు అనుకోవటం కాదు, ఆయన అనుకోవాలి.

ఆయన పట్ల ఉన్న ప్రేమ ఎంత దూరం తీసుకొని వెళ్ళాలి అంటే ఆయనా, నేను ఒక్కటే అనే స్థితికి వెళితే అప్పుడు వాడికి అద్వైతానుభవం కలుగుతుంది. జ్ఞాని ఎవరినైనా చూస్తున్నాడు అనుకోండి మీ లోపల ఉన్న నారాయణుని చూస్తాడు గాని మీ శరీరంగాని, మనస్సుగాని, గుణాలుకాని జ్ఞానికి అక్కరలేదు. ఉన్నది నారాయణుడే, అందుచేత అందరిలోను ఆయననే చూస్తాడు. రెండు ఉంటే భయం, రెండు ఉంటే ఇష్టం, అయిష్టం. ఉన్నది ఒక్కటే అయితే ఇష్టం ఏముంది, అయిష్టం ఏముంది, మీ ప్రేమ వలన ఆ స్థితికి రావాలి. మేము ఈశ్వరుడిని బాగా నమ్ముతున్నాము అని మనం అనుకోవచ్చు. మనం అనుకోవటం వలన ప్రయోజనం లేదు, ఆయన అనుకోవాలి. ఆయన ఎప్పుడు అనుకొంటాడు? ఆయన మీద మనకు ఉన్న ప్రేమ నిజమైతే అప్పుడు ఆయన అనుకొంటాడు. మీరు అనుకొనే గొడవలు అన్నీ అబద్దాలు అంటున్నారు రూజ్‌వెల్ట్. మీరు మంచివారు అనుకొన్నా అబద్దమే, మీరు చెడ్డవారు అనుకొన్నా అబద్దమే. ఇవన్నీ ఎవరు అనుకొంటున్నారు, మనస్సు అనుకొంటోంది. ఆ మనస్సులో నుండి బయటకు రావటం నేర్చుకోరు ఏమిటి అంటున్నాడు రూజ్‌వెల్ట్. ఈశ్వరుడి పట్ల ఆరాధన పెరుగుతూ ఉంటే, ఆయనతో మీ మనస్సు సన్నిహితంగా ఉంటే మీకు తెలియకుండా మీ మనస్సు దానంతట అదే ఈశ్వరునికి స్వాధీనమైపోతుంది. ఎప్పుడైతే మీ మనస్సు ఆయనకు స్వాధీనం అయిందో ఈ మనస్సును ఆయన తీసేసుకొని మీకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు.

తుకారామ్ చిన్నప్పడు వ్యాపారం చేసి నష్టాలు తెస్తూ ఉంటే ఇంట్లోవారు కొట్టేవారట. పూర్వం సత్తుబేడలు, సత్తు పావళాలు ఉండేవి, అవి తెచ్చి తుకారామ్‌కి ఇచ్చేవారట. అవి బైట మారవు, తెలివైనవారు ఎవరూ పుచ్చుకోరు. వీడి దగ్గరకు వస్తే అవి తీసుకొని వారికి కావలసిన వస్తువులు ఇచ్చేవాడట. అవి సత్తు బేడలు అని ఆయనకు తెలుసు, ఆయన మంచితనం చూడండి. ఆ సత్తు బేడలు ఆయన తీసుకోకపోతే ఇంకొకరి దగ్గరకు వెళ్ళి వారిని మోసం చేస్తారు, అది ఏదో మనమే మోసపోదాము అనుకొనేవాడట. ఇలా సత్తు బేడలు తీసుకొని ఇంటికివెళితే ఇంట్లోవారు కొట్టేవారట. ఇవి అన్నీ ఎంతో నార్మల్‌గా, సహజంగా అనుభవించాడు, అది తుకారామ్ గొప్పతనం. పెద్ద పెద్ద మహాత్ముల శరీరాలు శవాలు అవుతూ ఉంటే ఈయనను తీసుకొని వెళ్ళటానికి వైకుంఠం నుండి విమానం వచ్చింది. తుకారామ్ యొక్క పుణ్యబలం అటువంటిది. తుకారామ్ ఏమని చెప్పాడు అంటే ఏదో

అహంకారం, అహంకారం అంటున్నారు. శాస్త్రం గురించి నాకు తెలియదు. పాండురంగడు పట్ల భక్తి తప్పించి నాకు ఏమీ తెలియదు. పాండురంగడు పట్ల నాకు ఉన్న ప్రేమప్రవాహంలో నాకు తెలియకుండానే అహంభావన కొట్టుకొనిపోయింది, దానిని పోగొట్టుకోవటానికి నేను ఏమీ ప్రయత్నం చేయలేదు, ఆ ప్రేమ ప్రవాహంలో దానంతట అదే పోయింది అన్నాడు, వాడు తుకారామ్. పాండురంగడుపట్ల ఆయనకు ఉన్న ప్రేమ ప్రవాహంలో మనస్సు నిశ్శేషంగా పోయింది మనస్సు హృదయంలో లీనమవ్వాలి, అది నిజమైన మౌనం. మనస్సు హృదయంలో ఎప్పుడైతే లయమయ్యిందో తనని తాను పోగొట్టుకుంటుంది. బుడగ సముద్రంలో కరిగిపోయింది అనుకోండి బుడగ సముద్రం అవుతుంది. మన మనస్సు అనే బుడగ హృదయంలో కరిగిపోతే అక్కడ ఉన్న చైతన్యం మనకు తానుగా వ్యక్తమవుతుంది. అదే కడసారి జన్మ.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 1-1-09, ఏలూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడు గీతలో భక్తి యోగము, కర్మయోగము, ధ్యానయోగము చాలా యోగాలు చెప్పాడు, మనందరం బ్రాహ్మీస్థితి పొందటంకోసం ఈ యోగాలు అన్నీ చెప్పాడు. అందుచేత వీటిని సమన్వయం చేసుకొని మనం బ్రాహ్మీస్థితిని పొందాలి. బ్రాహ్మీస్థితి పొందేవరకు మనకు సంసారం తప్పదు. ఈ సంసారంలో నుండి, అజ్ఞానంలోనుండి విడుదల అయ్యేవరకు మనకు శాంతి లేదు, సుఖం లేదు, ఏ జన్మకు ఆ జన్మ ఇలా శవాలను మోస్తూ ఉండవలసిందే. భగవంతుడు చెప్పిన మాట మీద మనకు నమ్మకం కుదరటంలేదు. మనకు పుణ్యబలం లేకపోతే ఈశ్వరుడు చెప్పినమాట మీద మనకు విశ్వాసం కలగదు. శ్రద్ధ లేకుండా మనకు జ్ఞానం కలుగదు. భక్తికి మించిన సంపద లేదు. మనం ఎన్ని సంపదలు సంపాదించినా మన శరీరంలో నుండి గాలి బయటకు పోయినప్పుడు వాటితో సంబంధం పోతుంది. మనం పెంచిపోషించుకొన్న భక్తి జన్మాంతరంలో మన కూడా వస్తుంది. అయితే భక్తిని సంపాదించుకోవటానికి మనం ప్రయత్నం చేయటంలేదు ఎందుచేతనంటే దాని విలువ మనకు తెలియటంలేదు. దానికి సంసారం మీద ఉన్న వ్యామోహం కారణం, రాగద్వేషాలు కారణం.